**విలేకరులు కావలెను**

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం






ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 70 శనివారం జూలై 11 2026, పేజీలు - 4 వెల :2/-


# భద్రాచలం రాముల వారి మీద ఆన...

# ఇది మా కాంగ్రెస్ కార్యకర్తల మాట..

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దే అధికారం - సీఎం రేవంత్ రెడ్డి







హిందుస్థాన్ మీడియా

రాష్ట్రంలోని రైతుల కళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వానికి ఆశీర్వాదమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆశీర్వాద సభా వేదికగా అశేషంగా తరలివచ్చిన రైతాంగాన్ని ఉద్దేశించి చెప్పారు. గడిచిన 9 రోజుల్లో రూ. 9,000 కోట్ల మేరకు 73.30 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా చెల్లించిన సందర్భంగా ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో రైతు ఆశీర్వాద సభ నిర్వహించారు. సభా వేదికగా రైతు భరోసా చివరి విడతగా 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 1009.15 కోట్ల నిధులను విడుదల చేయడంతో పాటు రైతులకు ఈ-పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , వాకిటి శ్రీహరి తో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం అశేషంగా తరలివచ్చిన రైతాంగాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. రైతులకు వ్యవసాయం పండుగ చేయాలని, రైతులు రాజును చేయాలన్న ఆలోచనతోనే గడిచిన 30 నెలల్లో 1 లక్ష 70 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగంపై ఖర్చు చేశామని చెప్పారు. రైతు భరోసా కింద గత ఏడాది జూన్‌లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేశామని గుర్తుచేశారు. 30 నెలల్లో రైతు భరోసా కింద 36,135 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదని పెద్దలు చెప్పారని, రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే మా ఆశయమని అన్నారు. రైతు భరోసా, రుణ మాఫీ, బీమా, గిట్టుబాటు ధరలు, సన్నవడ్లకు బోనస్, ఉచిత కరెంట్, నష్టపరిహారం.. ఇలా రైతు సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం గడిచిన 30 నెలల్లో 1.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. సగటున ప్రతి నెలా రూ. 5,500 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటికి రాష్ట్రం రూ. 8.11 లక్షల కోట్ల మేరకు అప్పులు ఉండగా, ఎంతో సమయస్ఫూర్తితో రాష్ట్రాన్ని నడిపిస్తూ గత ప్రభుత్వ పథకాలతో పాటు అదనంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే పథకాలన్నీ కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి గారు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను ఉదహరించారు. ఎకరాకు రూ. 12 వేలకు పెంచి రైతు భరోసా అందిస్తున్నామన్నారు. 30 నెలల్లో రూ. 80 వేల కోట్ల మేరకు వడ్లను కొనుగోలు చేశామన్నారు. గత ప్రభుత్వ పథకాలతో పాటు అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డులు జారీ, సన్నబియ్యం పంపిణీ, 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు అందించడం, బ్యాంకుల లింకేజీతో 60 వేల కోట్ల మేరకు రుణాలు అందించడం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు పండుగ సారెగా ఇందిరమ్మ చీరలు అందించడంతో పాటు ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 67,717 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి అనేక అంశాలను వివరించారు. వచ్చే శాసనసభ ఎన్నికల 2029 మే, జూన్ లో జరుగుతాయని అంచనా వేసిన ముఖ్యమంత్రి గారు రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు, శాసనసభ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో మంత్రిమండలి సభ్యులు అందరూ రోజుకు 18 గంటలు పనిచేస్తారని, తెలంగాణలో ఎవరికీ అన్యాయం జరగనివ్వమని, దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీలు, వెనుబడిన వర్గాలు, మహిళలు, రైతులు, విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలబెడుతామని చెప్పారు. రాష్ట్రంలో మొక్కజొన్న రైతుల కోసం రూ. 3,504 కోట్లు విడుదల చేశారు. అలాగే, పలువురు రైతులకు ఈ-పట్టాదారు పాసుపుస్తకాలను అందించి ముఖ్యమంత్రి ఆ కార్యక్రమాన్ని సభా వేదికగా లాంఛనంగా ప్రారంభించారు.

# చేర్యాలకు ఏమైంది...?



**వరుస రోడ్డు ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు..!ఒకడు ఎదురుగా వచ్చి గుద్దుతాడు... మరొకడు వెనుక నుంచి వచ్చి ఢీకొడతాడు... ఇంకొకడు రోడ్డు దాటుతున్న వారినే బలితీసుకుంటాడు..! హైవే పనుల ప్రభావమా..? అధికారుల అలసత్వమా..? ప్రజల నిర్లక్ష్యమా..? ప్రమాదాలకు ఎప్పుడు బ్రేక్ పడుతుంది..?**

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

ఒకప్పుడు ప్రశాంత పట్టణంగా పేరొందిన చేర్యాల... ఇప్పుడు వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. బైక్‌పై వెళ్తున్నవారైనా, కారులో ప్రయాణిస్తున్నవారైనా, కాలినడకన నడిచేవారైనా, రోడ్డు దాటుతున్న పాదచారులైనా... ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. ఒకడు ఎదురుగా వచ్చి గుద్దుతాడు... మరొకడు వెనుక నుంచి వచ్చి ఢీకొడతాడు.. ఇంకొకడు రోడ్డు దాటుతున్న వారినే బలితీసుకుంటాడు. అసలు చేర్యాల రోడ్లపై సురక్షితంగా ప్రయాణించే పరిస్థితి ఉందా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరి నోట వినిపిస్తోంది. ఇటీవల ముస్త్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ఘటన మరువకముందే కడవేరుగు రోడ్డులో ముందు వెళు_న్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో అంకిరెడ్డిపల్లికి చెందిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మర్రిముచ్చాల సమీపంలో ఎక్సెల్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఇన్నోవా కారు ఢీకొట్టిన ఘటన కూడా తీవ్ర కలకలం రేపింది. అంతకుముందు ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే తన తాతతో కలిసి ఎక్సెల్ బైక్‌పై వెళ్తున్న ఓ ఇంటర్ విద్యార్థినిని లారీ ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తాజాగా చుంచనకోట క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న ఆకుల లక్ష్మయ్యను లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలా ఒకదాని వెంట ఒకటి వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో చేర్యాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అసలు ఈ ప్రమాదాలకు కారణం ఏమిటి? నేషనల్ హైవే పనులా? రోడ్లపై తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడమా? ట్రాఫిక్ నియమాల అమలులో అధికారుల అలసత్వమా? లేక వాహనదారుల నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయడం లేదా తాత్కాలిక చర్యలు తీసుకోవడం తప్ప, ప్రమాదాలు మళ్లీ జరగకుండా తీసుకోవాల్సిన శాశ్వత చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో రోజంతా రద్దీ అధికంగా ఉంటుంది. పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్, బస్టాండ్, వ్యాపార సముదాయాల కారణంగా వేలాది మంది రోడ్లు దాటుతుంటారు. అయినప్పటికీ అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, పాదచారుల క్రాసింగ్‌లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తగిన స్థాయిలో లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందని ప్రజలు అంటున్నారు. ప్రజల డిమాండ్లు ఇవే... పట్టణ పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు లేదా ప్రత్యామ్నాయ వేగ నియంత్రణ చర్యలు ఏర్పాటు చేయాలి. స్పష్టంగా కనిపించే హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, ఫ్లాషింగ్ లైట్లు ఏర్పాటు చేయాలి. పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌లు, రోడ్డు దాటే ప్రత్యేక ప్రాంతాలు కల్పించాలి. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. అధిక వేగంతో వెళ్లే వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి. సీసీ కెమెరాలు, స్పీడ్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు, వాహనదారులు, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నేషనల్ హైవే అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపాలిటీ సంయుక్తంగా ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. హైవేలో స్పీడ్ బ్రేకర్లు ఉండవనే నిబంధనను సాకుగా చూపకుండా, పట్టణ పరిధిలో ప్రజల ప్రాణాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యామ్నాయ భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మరో ప్రాణం పోయిన తర్వాత స్పందించడం కాదు... ఇప్పుడే చర్యలు తీసుకోవాలి. చేర్యాలలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. అధికారులు, నేషనల్ హైవే శాఖ, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపాలిటీ సమన్వయంతో వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని, "ప్రజల ప్రాణాలే మొదటి ప్రాధాన్యం" అనే దృక్పథంతో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవంతమైన విద్యాసంస్థల బంద్

**-విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్**



మద్దూరు, హిందుస్థాన్ మీడియా:
అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం మద్దూరు, చేర్యాల ప్రాంతాల్లో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ద్యార్థులు, ప్రజలను ప్రభావితం చేస్తున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బంద్ చేపట్టారు. విద్యాసంస్థల్లో పారదర్శకత, న్యాయం పాటించాలని, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని నాయకులు కోరారు. బంద్ సందర్భంగా విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగగా స్థానిక ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో యాసీన్, అబ్దుల్ హరీష్, సాయికిరణ్, అభినవ్, ప్రశాంత్, లోకేష్, అరుణ్ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. బంద్‌కు సహకరించిన విద్యార్థులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలి:ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:
వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వర్టికల్స్ వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్--2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని, సీఐఈఆర్ పోర్టల్ వినియోగంపై కూడా దృష్టి సారించాలని సూచి ంచారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీ భద్రతను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్-100కు సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను కూడా అడిగి తెలుసుకున్న ఎస్పీ, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు,



ఎస్ఐలు అఖిల, రాజమౌళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రై డే--ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:
చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు సుందరయ్య నగర్‌లో శుక్రవారం నిర్వహించిన డ్రై డే--ఫ్రైడే కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి నర్సింగరావు పాల్గొని పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూసు కోవాలని, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛమైన తాగునీటినే





వినియోగించాలని వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము నర్సింగరావు, చింతల కిష్టయ్య, చింతల బాలరాజు, దండబోయిన సాయి బాబా, దండబోయిన నవీన్, సుంకరి యాదయ్య, చింతల సంపత్, వార్డు ఆఫీసర్ గంగాధర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాంసాగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

కొమురవెల్లి, హిందుస్థాన్ మీడియా:
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం గ్రామ ప్రజాప్రతినిధులు భూమిపూజ చేసి ప్రారంభించారు. గ్రామంలో మెరుగైన రహదారి సౌకర్యం కల్పించి ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందించాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏసిరెడ్డి మల్లారెడ్డి, వార్డు సభ్యులు చింతల కరుణాకర్, గంగుల ఐలయ్య, తాడూరి రమేష్, తాడూరి కవిత పాల్గొన్నారు. అలాగే గ్రామ నాయకులు అక్కెనపల్లి ప్రవీణ్ రెడ్డి, గుండా



చంద్రం, యాదవ రెడ్డి, నర్సింహారెడ్డి, చింతల రమేష్, శెట్టిపల్లి విజేందర్ రెడ్డి, అక్కెనపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవి, తాడూరి పరమేష్, తాడూరి నీలవ్వ, తాడూరి నరేష్, గిద్దల యాదగిరి, గుజ్జ రాజయ్య, తాడూరి యాదగిరి, తాడూరి మహేందర్, వెంకటేష్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మృత కళాకారుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

కొమురవెల్లి, హిందుస్థాన్ మీడియా:
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రసూలాబాద్ గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం రఘుపతి అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబం నిరుపేద కావడంతో పాటు సొంత ఇల్లు, స్థలం కూడా లేకపోవడంతో పలువురు ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. రసూలాబాద్ గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి--అనూష గౌడ్ రూ.5,000, తపస్‌పల్లి సర్పంచ్ పుట్ట కనకరాజు రూ.5,000, అయినాపూర్ సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ రూ.2,000, అయినాపూర్ మాజీ సర్పంచ్ మెరుగు శ్రీనివాస్ గౌడ్ రూ.3,000, రసూలాబాద్ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల సుదర్శన్ రూ.2,000, అయినాపూర్ గ్రామ కార్యదర్శి రాజు రూ.1,000 చొప్పున అందజేసి అంత్యక్రియల నిర్వహణకు



చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి పిన్నింటి రత్నం, నిరుద్యోగ కళాకారుల రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు, కవి--గాయకులు పిల్లుట్ల శ్యాంసుందర్, సాయిలు, పరశు రాములు ఆర్థిక సహాయం అందించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి కౌన్సిలర్ ప్రసాద్



చేర్యాల, హిందుస్థాన్ మీడియా:
చేర్యాల పట్టణంలోని 7వ వార్డులో మైసమ్మ దేవి శుభోదయ స్కూల్ పరిసరాలు, స్కూల్ రోడ్డులో నిర్వహించిన "డ్రై డే--ఫ్రై డే" కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పాత టైర్లు, కొబ్బరి బోండాలు, పాత కూలర్లు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి బుర్ర అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూమిపూజలో పాల్గొన్న కౌన్సిలర్ షరీఫా బేగం ఖాజా



చేర్యాల, హిందుస్థాన్ మీడియా:
చేర్యాల పట్టణంలోని 12వ వార్డులో లబ్ధిదారురాలు ఫహీమాకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సహకారంతో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్, కొమ్ము రాజేశ్వరి, కాంగ్రెస్ నాయకులు పచ్చిమండ్ల వెంకటయ్య గౌడ్, శనిగారి బిక్షపతి, మాచర్ల వెంకట్, తుమ్మలపల్లి సంతోష్, యుండి అసద్, యాకూబ్, వార్డు అధికారి అనిల్, హౌసింగ్ ఏఈ మోనిక తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం: ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ



బెజ్జంకి, హిందుస్థాన్ మీడియా:
విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ బెజ్జంకి మండలంలో విజయవంతమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మాధు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మాధు, ఎస్ఎఫ్ఐ నాయకుడు బొమ్మిడి సాయికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యా హ్న భోజన పథకానికి నిధులు పెంచడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే 7, 8, 9 తరగతుల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ--2020) అమలును విరమించుకోవాలని, విద్యా రంగానికి తగిన బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

## టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' 2కే అవగాహన ర్యాలీ

**-జూలై 23న నిర్వహణ.. పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ, హిందుస్థాన్ మీడియా:
మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న "సే నో టు డ్రగ్స్" నినాదంతో 2కే అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని టీఎస్‌జేయూ చేపడుతున్న కార్యక్రమాన్ని అభినందిస్తూ, ర్యాలీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జిల్లా కోశాధికారి సల్మాన్ ఖాన్, జిల్లా ప్రచార కార్యదర్శి అజీమ్ పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, యువత, విద్యార్థులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


## హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు, హిందుస్థాన్ మీడియా:

మద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వరదరాజులు తెలిపారు. హెడ్ కుక్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణత, అసిస్టెంట్ కుక్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. అభ్యర్థుల వయస్సు 25 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.9,750 గౌరవ వేతనం అందజేయబడుతుంది. ఆసక్తి గల మహిళలు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తదితర పత్రాలతో జూలై 14, 2026 సాయంత్రం 5 గంటలలోపు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మద్దూరు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వరదరాజులు సూచించారు. మరిన్ని వివరాలకు పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## చేర్యాలలో విషాదం.. లారీ ఢీకొని వ్యక్తి మృతి





లక్ష్మయ్య (ఫైల్ ఫోటో )

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని చుంచనకోట క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చేర్యాలకు చెందిన ఆకుల లక్ష్మయ్య (55) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మృతుడు లక్ష్మయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. అయితే ఈరోజు ఉదయం చేర్యాలకు వచ్చిన ఆయన, చుంచనకోట క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటే క్రమంలో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. లక్ష్మయ్య మృతితో ఆయన భార్య, పిల్లలు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి సంబంధించిన వివరాలపై దర్యాప్తు చేపట్టారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

-కలెక్టర్ రాజర్షిషా



హిందుస్థాన్ మీడియా:


ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు, విద్యార్థుల నమోదు పెంచేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్', ఇతర విద్యాశాఖ సంబంధిత అంశాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, ఉపాధ్యాయుల వివరాలను 'యు-డైస్ ప్లస్' పోర్టల్‌లో నమోదు పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గత ఏడాది కంటే 10 శాతం పెంచాలని, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో అన్ని సీట్లను వంద శాతం భర్తీ చేయాలని ఆదేశించారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్ బుక్స్ అందించి, ఆ వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు ఖాన్ అకాడమీ,ఇంగ్లీష్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వీటితో పాటు దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణం, 'అపార్' (APAAR) ఐడీల జనరేషన్, ఎంబీ పెండెన్సీ క్లియరెన్స్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఈ జిల్లా మేనేజర్ బండి రవి ఆధార్ నవీకరణ పై వివరిస్తూ, ఆధార్ లో ఏవైనా సమస్యలు ఉంటే నివృత్తి కోసం సిటిజన్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1947 ను సంప్రదించవచ్చున్నారు. పుట్టిన తేదీ, జెండర్ మార్పులకు జీవితకాలంలో ఒక్కసారే అవకాశం ఉండగా, పేరును రెండు సార్లు మార్చుకోవచ్చని, ఈ పరిమితి దాటితే హైదరాబాద్ రీజినల్ ఆఫీస్‌ను సంప్రదించాల్సి ఉంటుందని వివరించారు. వివరాల సవరణకు సరైన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, పుట్టిన తేదీ మార్పునకు బర్త్ సర్టిఫికెట్/పాస్పోర్ట్/గెజిటెడ్ సర్టిఫికెట్, పేరులో అక్షరాల తప్పులకు రెసిడెన్స్ సర్టిఫికెట్ జత చేయాలన్నారు. ఇక చిరునామా, మొబైల్ నెంబర్‌ను సిటిజన్స్ వారి ఇంటి వద్ద నుంచే స్వంతంగా UIDAI Aadhaar App ద్వారా అప్డేట్ చేసుకోవచ్చని వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్,డీఈఓ మాధవి,మెప్మా పీడీ రాజు, సెక్టోరల్ అధికారులు రఘురమణ,తిరుపతి, అజయ్,ఎంఈఓలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.నా

# సింగరేణి ఐదు గనులకు ప్రతిష్ఠాత్మక 5-స్టార్ రేటింగ్

-జాతీయ స్థాయిలో గుర్తింపు.. భట్టి విక్రమార్క అభినందనలు

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన అత్యుత్తమ గనుల ఎంపికలో సింగరేణి సంస్థకు చెందిన ఆర్‌కే న్యూటెక్, ఆర్‌కే-6, జేవీఆర్ ఓసీ-2, ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్, ఆర్జీ ఓసీ-1 గనులు ప్రతిష్ఠాత్మక 5-స్టార్ రేటింగ్ సాధించాయి.దేశవ్యాప్తంగా 382 బొగ్గు గనులు పోటీపడగా 50 గనులు మాత్రమే 5-స్టార్ రేటింగ్‌కు ఎంపికయ్యాయి. వాటిలో సింగరేణికి చెందిన ఐదు గనులు చోటు దక్కించుకోవడం విశేషం. గత ఏడాది నాలుగు గనులకు ఈ గుర్తింపు లభించగా, ఈసారి ఐదు గనులు ఎంపిక కావడం సింగరేణి చరిత్రలోనే అత్యధికం. అలాగే మరో 17 గనులు 4-స్టార్ రేటింగ్ సాధించాయి.గనుల్లో భద్రత, కార్మిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, గని నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, గ్రామాభివృద్ధి వంటి పలు ప్రమాణాల ఆధారంగా కేంద్ర బొగ్గు శాఖ ఈ రేటింగ్‌ను ప్రకటిస్తుంది.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యం, అధికారులు, కార్మికులు, సిబ్బందిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని గనులు కూడా ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు.




# నలుగురి ప్రాణాలు కాపాడిన రాయ్‌పోల్ పోలీసులు

-అభినందించిన సీపీ రష్మీ పెరుమాళ్

రాయ్‌పోల్, హిందుస్థాన్ మీడియా:

గృహ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ తన ముగ్గురు చిన్నారులతో కలిసి ఆత్మహత్యకు యత్నించగా, రాయ్‌పోల్ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి నలుగురి ప్రాణాలను కాపాడారు. రాయ్‌పోల్ మండలం తిమ్మాక్కపల్లి గ్రామానికి చెందిన 28 ఏళ్ల మహిళకు తన అత్తతో కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె తన ముగ్గురు కుమారులు (7 సంవత్సరాలు, 3 సంవత్సరాలు, 9 నెలల పసికందు)తో కలిసి గ్రామ సమీపంలోని ఓ బావి వద్దకు వెళ్లింది.మహిళ పిల్లలతో కలిసి వెళ్లడాన్ని గమనించిన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వెంటనే డయల్--100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రాయ్‌పోల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఎన్. ప్రశాంత్, మల్లేష్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మహిళతో మాట్లాడి ఆమెను, ముగ్గురు చిన్నారులను సురక్షితంగా రక్షించారు. సమయస్ఫూర్తితో స్పందించి నలుగురి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లు ఎన్. ప్రశాంత్, మల్లేష్‌లను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా వెంటనే డయల్--100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కుటుంబ సమస్యలు లేదా ఇతర కారణాలతో ఎవరూ క్షణికావేశంలో ప్రాణాలు తీసుకునే నిర్ణయాలు తీసుకోవద్దని, సమస్యలకు కౌన్సెలింగ్, చర్చల ద్వారా పరిష్కారం వెతుక్కోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# చేర్యాలలో ఎమ్మార్వో లేక రిజిస్ట్రేషన్లకు బ్రేక్..!

-ఏసీబీ ట్రాప్ తర్వాత నిలిచిన సేవలు..

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

చేర్యాల తహసీల్దార్ (ఎమ్మార్వో) ఏసీబీ అవినీతి కేసులో పట్టుబడి సస్పెండ్ కావడంతో రెవెన్యూ శాఖ సేవలు దాదాపు స్తంభించిపోయాయి. ముఖ్యంగా భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, రెవెన్యూ అనుమతులకు సంబంధించిన పలు పనులు నిలిచిపోవడంతో రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మార్వో కార్యాలయానికి ప్రతిరోజూ వచ్చిన ప్రజలు అధికారుల కోసం గంటల తరబడి వేచి చూసినా పనులు జరగక నిరాశతో వెనుదిరుగుతున్నారు. భూముల కొనుగోలు, విక్రయాలు నిలిచిపోవడంతో రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ప్రభావం పడుతోంది. రైతులు వ్యవసాయ అవసరాల కోసం భూ రికార్డులు, ఇతర రెవెన్యూ ధ్రువపత్రాలు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధికారిని నియమించకపోవడం వల్ల పెండింగ్ దరఖాస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రజల డిమాండ్ చేర్యాలలో రెవెన్యూ సేవలు సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి ఎమ్మార్వో లేదా ఇన్‌చార్జ్ అధికారిని నియమించి, పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రజలు, రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.



# ఏసీబీ పేరు వినగానే రూ.96 వేలు..!

-భయం సైబర్ నేరగాడిదా..? లేక మనస్సాక్షిదా..?

-నిజాయితీకి భయం ఉండదు.. మరి భయపడింది ఏమిటి?

చేర్యాల (హిందుస్థాన్ మీడియా):

ఒక ఫోన్ కాల్... ఆ కాల్‌లో "నేను ఏసీబీ అధికారి మాట్లాడుతున్నాను" అనే మాట... వెంటనే రూ.96 వేల బదిలీ..! ఈ ఘటనను కేవలం మరో సైబర్ మోసంగా చూసి పక్కన పెట్టేయాలా? లేక ఇది ప్రభుత్వ వ్యవస్థలో నెలకొన్న భయాలు, అనుమానాలు, అవినీతి ఆరోపణలపై సమాజం ఆలోచించాల్సిన సందర్భమా?

-బలహీనతలపైనే సైబర్ దాడి


సైబర్ నేరగాళ్లు మనుషుల బలహీనతలనే ఆయుధంగా వాడతారు. కానీ ఆ బలహీనత ఏమిటి? భయమా? అత్యాశా? లేక గతంలో చేసిన తప్పు బయటపడుతుందనే ఆందోళనా? ఈ ప్రశ్నకు సమాధానం ప్రతి ఘటనలో ఒకేలా ఉండకపోవచ్చు. అయినప్పటికీ, ఈ సంఘటన ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది.

-ఆలోచించాల్సిన ప్రశ్న:

ఒక ప్రభుత్వ ఉద్యోగి తన విధులు పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహిస్తుంటే... "నీపై ఏసీబీ కేసు ఉంది" అని చెప్పగానే ఎందుకు ఆందోళన చెందాలి? చట్టపరమైన మార్గాన్ని ఎంచుకోవాల్సింది పోయి, వెంటనే డబ్బు పంపాలనే ఆలోచన ఎందుకు వచ్చింది? ఇవి దర్యాప్తులోనే తేలాల్సిన అంశాలు అయినప్పటికీ, ప్రజల్లో చర్చకు కారణమవుతున్న ప్రశ్నలు మాత్రం ఇవే.

-దెబ్బతింటున్న ప్రజా విశ్వాసం

ఈ ఘటనతో మరో విషయం స్పష్టమవుతోంది. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు ఎంతటి అనుమానాలు పెరిగాయో..! ఏసీబీ పేరు వినగానే డబ్బు పంపారనే వార్త బయటకు రాగానే, "లంచం ఇచ్చి తప్పించుకోవాలనుకున్నారా?" అనే చర్చ మొదలైంది. ఇలాంటి అనుమానాలు రావడం కూడా ప్రజా వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటోందనే సంకేతమే. అవినీతి చేసినవారు ఉంటే వారిపై కఠిన చర్యలు తప్పనిసరి. అదే సమయంలో, నిర్దోషులైతే వారిపై అనవసర అనుమానాలు తొలగించే బాధ్యత కూడా దర్యాప్తు సంస్థలదే. నిజం ఏదైనా సరే, ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిందే.




-బాధ్యత వర్సెస్ భయం

ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం జీతం తీసుకునే ఉద్యోగం కాదు... అది ప్రజల విశ్వాసాన్ని మోసే బాధ్యత. ఆ విశ్వాసాన్ని కాపాడాలంటే పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనం తప్పనిసరి. అప్పుడే ఏసీబీ పేరు వినగానే గుండెల్లో భయం కాదు... "నేను తప్పు చేయలేదు" అనే ధైర్యం ముందుంటుంది. ఒక ఫోన్ కాల్ రూ.96 వేలు తీసుకెళ్లింది... కానీ ఆ ఘటన లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది వ్యవస్థే!

# మూడో సినిమాతో వస్తున్న రోషన్ కనకాల.. ఈసారి సైన్స్ ఫిక్షన్‌తో ప్రయోగం!



-నటుడు రోషన్ కనకాల మూడో సినిమా హైదరాబాద్‌లో ప్రారంభం
-ప్రయోగాత్మక కథలకు కేరాఫ్ అయిన విఐ ఆనంద్ కథ అందిస్తున్నారు
--రెండు సినిమాలు నిరాశపరచడంతో ఈ ప్రాజెక్ట్‌పైనే రోషన్ ఆశలు
-సైన్స్ ఫిక్షన్, రొమాంటిక్ కామెడీ జానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మాణం

రాజీవ్ కనకాల, సుమ దంపతుల కుమారుడు రోషన్ కనకాల తన మూడో సినిమాను అధికారికంగా ప్రారంభించాడు. 'బబుల్‌గమ్', 'మోగ్లి' చిత్రాలతో హీరోగా పరిచయమైనా, ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తన కెరీర్‌కు కీలకమైన మూడో సినిమా కోసం రోషన్ ఒక వినూత్నమైన సైన్స్ ఫిక్షన్ కథను ఎంచుకున్నాడు. ఈ చిత్రానికి ప్రయోగాత్మక సినిమాలకు పేరుగాంచిన దర్శకుడు విఐ ఆనంద్ కథ అందించడంతో పాటు సమర్పకుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. విజయ్ కె. కమ్మిశెట్టి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా హాజరై తొలి క్లాప్ కొట్టాడు. ఈ సినిమాకు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలకు పనిచేసిన దిగ్గజ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ పనిచేస్తుండటం విశేషం. సైన్స్ ఫిక్షన్, రొమాంటిక్ కామెడీ, ఫాంటసీ అంశాలతో భారీ బడ్జెట్, ఉన్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రోషన్ సరసన గహాజీ షిజు కున్నత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సత్య, సుదర్శన్, రవితేజ నన్నిమాల ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ వీఎఫ్ఎక్స్‌తో కూడిన ఈ హై-కాన్సెప్ట్ ఎంటర్‌టైనర్‌తో రోషన్ కమర్షియల్‌గా మంచి బ్రేక్ అందుకుంటాడని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ నెలా ఖరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ ప్రాజెక్ట్‌తోనైనా రోషన్ విజయం సాధిస్తాడేమో చూడాలి.

# టాలీవుడ్‌లో వారసుల పై సమంత వ్యాఖ్యలు మరోసారి వైరల్



సినీ పరిశ్రమలో తరచుగా వినిపించే 'నెపోటిజం' (వారసత్వం)పై స్టార్ హీరోయిన్ సమంత గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి తెరపైకి వచ్చాయి. పరిశ్రమలో వారసులైనా, బయటి నుంచి వచ్చినా ప్రతి ఒక్కరికీ వారి సొంత సవాళ్లు ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో సమంత తొలిసారి పాల్గొన్నప్పుడు, హోస్ట్ కరణ్ జోహార్ ఆమెను నెపోటిజంపై ప్రశ్నించారు. "తెలుగు పరిశ్రమలో హీరోల కొడుకులు, మేనల్లుళ్లు సులభంగా హీరోలవుతారు. విజయ్ దేవరకొండ లాంటి కొద్దిమంది మాత్రమే బయటి నుంచి వచ్చి నిలదొక్కుకున్నారు. దీనిపై మీరేమంటారు?" అని అడిగారు. దీనికి సమంత స్పందిస్తూ.. "వారసులు అయినా, బయటి నుంచి వచ్చిన వాళ్లయినా ప్రతి ఒక్కరికీ వారి సొంత సమస్యలు ఉంటాయి. అందరూ వాటిని ఎదుర్కోవాల్సిందే" అని అన్నారు. స్టార్ కిడ్స్‌కు కెరీర్ ఆరంభంలోనే ఒక అడ్వాంటేజ్ ఉంటుందన్న వాదనపైనా ఆమె మాట్లాడారు. సినీ కుటుంబం నుంచి వచ్చిన వారిపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుందని, వారి ప్రతి కదలికను ప్రేక్షకులు, పరిశ్రమ గమనిస్తుండడం జరుగుతుందని చెప్పారు. "నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఫెయిల్ అయితే, ఆ విషయం మా అమ్మానాన్నలకు, సోదరులకు మాత్రమే తెలిసేది. కానీ, ఒక స్టార్ కిడ్ ఫెయిల్ అయితే ఆ విషయం దేశం మొత్తానికి తెలుస్తుంది" అని సమంత వివరించారు. చివరకు అంతా ప్రేక్షకుల ఆదరణ మీదే ఆధారపడి ఉంటుందని, అంతిమ నిర్ణయం ఎప్పుడూ వారి చేతుల్లోనే ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. 2010లో 'ఏ మాయ చేసావె' చిత్రంతో అరంగేట్రం చేసిన సమంత.. దూకుడు, రంగస్థలం వంటి అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలతో అగ్ర కథానాయికగా ఎదిగారు. ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం ఇటీవల విడుదలై హిట్ టాక్ తెచ్చుకుంది.

# 'లెనిన్'మూవీ రివ్యూ!




అఖిల్ హీరోగా చేసిన సినిమానే 'లెనిన్'. సితార నాగవంశీ - నాగార్జున సంయుక్తంగా నిర్మించిన సినిమా ఇది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. భారీ విజయానికి చేరువకోవడానికి ప్రయత్నిస్తున్న అఖిల్ ను, 'ఏజెంట్' సినిమా కాస్త గట్టిగానే ఇబ్బంది పెట్టింది. దాంతో కాస్త గ్యాప్ తీసుకుని, కథపై ఎక్కువగానే కసరత్తులు చేస్తూ అఖిల్ లైన్లో పెట్టిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమా ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. శ్రీ రామాపురంలో 'భారతం మిట్ట' అనే ప్రదేశం ఉంటుంది. మహాభారత కాలంతో ముడిపడిన ఆ ప్రదేశంలో 'ద్రౌపది దేవి' పూజలందుకుంటూ ఉంటుంది. ప్రతి ఏటా ద్రౌపదీదేవికి అక్కడ జాతర నిర్వహిస్తూ ఉంటారు. భర్తను కోల్పోయినప్పటికీ ఆ ఊరిపై జయంతి (ఈశ్వరీరావు) పెత్తనం చేస్తుంటుంది. అనాథగా ఆ ఊళ్లో అడుగుపెట్టిన 'లెనిన్' (అఖిల్)ను ఆమెనే చేరదీస్తుంది. తన కొడుకు వసంత్ (ప్రమోద్)తో పాటు పెంచుతుంది. డాక్టర్ గా పై చదువులు కోసం వసంత్ మద్రాస్ వెళ్లిపోగా, జయంతికి సంబంధించిన పనులను చూసుకుంటూ లెనిన్ అక్కడే ఉండిపోతాడు. ఆ ఊరిపెద్ద మనుషులలో ఒకరుగా నీలకంఠం (రాంకీ) చెలామణి అవుతుంటాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు ఒకరు 'వైదేహి' అయితే .. మరొకరు 'భారతి' ( భాగ్యశ్రీ బోర్సే). పట్నంలో బంధువుల దగ్గరే ఉంటూ చదువుకున్న భారతీ, తన సొంత ఊరుకు చేరుకుంటుంది. ఆమెను చూడగానే లెనిన్ మనసు పారేసుకుంటాడు. ఇక డాక్టర్ చదువును పూర్తి చేసుకుని ఆ ఊరికి తిరిగొచ్చిన 'వసంత్'ను వైదేహి ప్రేమిస్తుంటుంది. దాంతో వాళ్లిద్దరికీ పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించుకుంటారు. ఆ గ్రామంపై పట్టు కోసం ఎమ్మెల్యే రాఘవరెడ్డి ప్రయత్నిస్తుంటాడు. తనని ఎంతమాత్రం లెక్కచేయని లెనిన్ - వసంత్ ల సంగతి చూడాలనే కోపంతో ఆయన ఉంటాడు. ఇక 'భారతం మిట్ట'పై పెత్తనం కోసం 'యతిరాజు' (శివాజీ) ఎదురుచూస్తుంటాడు. ఈ విషయంలో తనకి అడ్డుపడుతున్న జయంతిపై ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. ఇక లెనిన్ పై మనసు పడిన భారతిని వశపరచుకోవాలనే ఉద్దేశంతో 'తులసి' (శత్రు) ఉంటాడు. ఈ నేపథ్యంలోనే వసంత్ ను పెళ్లి చేసుకోవలసిన వైదేహి కనిపించకుండా పోతుంది. దాంతో అదే ముహూర్తానికి తన చిన్న కూతురైన భారతిని వసంత్ కి ఇచ్చి పెళ్లి చేయాలని నీలకంఠం నిర్ణయించుకుంటాడు. అప్పుడు భారతి ఏం చేస్తుంది? లెనిన్ తో ఆమె వివాహం జరుగుతుందా? ఆమె అక్కయ్య వైదేహి ఏమైపోతుంది? రాఘవరెడ్డి .. యతిరాజు .. తులసితో పాటు లెనిన్ ఎదుర్కోవలసిన మెయిన్ విలన్ ఎవరు? అనేది మిగతా కథ. శ్రీ రామాపురం అనే ఊరు 'లెనిన్' అనే యువకుడిని పెంచి పెద్ద చేస్తుంది. అందువలన తనను చేరదీసి కుటుంబానికి .. తనకి నీడనిచ్చిన ఊరుకి అతను ఎంతో నమ్మకంగా ఉంటూ ఉంటాడు. అలాంటి అతను భారతి ప్రేమలో పడతాడు. అయితే ఆ ప్రేమను పెళ్లి పీటలవరకూ తీసుకుని వెళ్లడానికి అతను కొంతమంది శత్రువులను ఎదుర్కోవలసి వస్తుంది. వాళ్లు ఎవరూ? వాళ్లతో అతనికి గల శత్రుత్వం ఏమిటి? అనేది ప్రధానమైన కథ. 1970 - 2000 కి మధ్య జరిగే ఈ కథలో అనేక కోణాలు కనిపిస్తాయి. ఆహ్లాదకరమైన గ్రామంలో అందమైన ప్రేమజంట. ఆ గ్రామంపై




పట్టు కోసం ఎదురుచూసే ఒక రాజకీయనాయకుడు, అక్కడ జాతర తన చేతుల మీదుగా జరగాలనే అధికార దాహంతో ఒకరు .. ఆ ప్రేమజంటను విడదీయాలనే తోచనలో మరొకరు. నమ్మిస్తూ నమ్మక ద్రోహానికి సిద్ధమవుతున్నదొకరు. ఇలా వివిధ కోణాల నుంచి అల్లుకున్న ఈ కథను ఆసక్తికరంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. ఇక దర్శకుడు 'ద్రౌపది' జాతరను ప్రధానంగా చేసుకుని, మహాభారతంలోని పాత్రలతో ముడిపెడుతూ ఈ కథను నడిపించాడు. ఫస్టు పార్టులో ఫస్టు ట్విస్ట్ ను ఇంటర్వెల్ కి ముందు పేల్చిన దర్శకుడు, అక్కడి నుంచి కథను మరింత వేడెక్కిస్తాడు. ఇక సెకండాఫ్ కూడా మరో ఒకటి రెండు ట్విస్టులతో వేగాన్ని పుంజుకుంటుంది. ద్వేషం .. ప్రతీకారం .. నమ్మకద్రోహంతో కూడిన సన్నివేశాలతో నడుస్తుంది. ఈ కథను మొత్తంగా పరిశీలన చేస్తే, అధికారం .. పెత్తనం .. కామం.. వ్యామోహం అనే బలహీనతలతో తనపై విరుచుకుపడుతున్న అరాచక శక్తులను కథానాయకుడు ఎలా ఎదుర్కొన్నాడు? అనేదే ప్రధానమైన ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఫస్టాఫ్ చాలా వరకూ హీరో - హీరోయిన్స్ మధ్య లవ్ - రొమాన్స్ .. అందుకు సంబంధించిన పాటలతో రక్తి కడుతుంది. ఇక సెకండాఫ్ లో ఆయా పాత్రల నిజస్వరూపాలను ఆవిష్కరించడం కనిపిస్తుంది. వారి అసలు రంగును తెలుసుకుంటూ హీరో ప్రీ క్లైమాక్స్ వైపు దిశగా కదులుతాడు. ఇక అప్పటి వరకూ సాగిన రక్తపాతం ఒక ఎత్తయితే, క్లైమాక్స్ లో చెలరేగే హింస మరో ఎత్తు. ఎంతో కొత్తగా ప్లాన్ చేశామని అనుకున్నప్పటికీ, క్లైమాక్స్ అనేది అన్ని వర్గాల ప్రేక్షకులకు సంతృప్తిని కలిగిస్తుందని చెప్పలేము. అఖిల్ నటన .. యాక్షన్ ..డాన్సులు బాగానే ఉన్నాయి. భాగ్యశ్రీ పాత్ర అంతగా బలమైనదేం కాదు గానీ, అందంగా.. ఆకర్షణీయంగా కనిపిస్తూ మార్కులు కొట్టేస్తుంది. పెళ్లి కూతురి గెటప్ లోను .. కొన్ని పాటల్లోను ఆమె గ్లామర్ కుర్రాళ్లను కట్టిపడేస్తుందనే చెప్పాలి. ఇక నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రలో ప్రమోద్ బాగా చేశాడు. కొన్ని చోట్ల నానీలా అనిపిస్తాడు. ఈశ్వరీరావు .. శివాజీ నటన కూడా ఆకట్టుకుంటుంది.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455